




అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -82 శుక్రవారం 28 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -7 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## మీర్ ఆలం చెరువుకు

# కొత్త హంగులు

**ఫ్యామిలీ టూరిస్టు హబ్ గా అభివృద్ధి..ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి**

**గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు**

**హైదరాబాద్ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు కల్పించాలని యోచిస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మీర్ ఆలం చెరువును గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని

మిగతా 2లో.



## నేపాల్ వరదవిషాదం

# 300 మంది భారతీయుల గల్లంతు

**విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య**

**సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్**



**ఖాట్మండ్,ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది.నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది.

మిగతా 2లో.



# నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

**కడియంపై వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డికి నోటీసులు**

**కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం**

**హైదరాబాద్,ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, 'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని,

మిగతా 2లో.

# హరీశ్ రావు అరెస్ట్

**హన్మకొండలో బిఆర్ఎస్ ధర్న**

**హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు**



**వరంగల్,ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు,

మిగతా 2లో.

# మైనింగ్ అధికారిపై ఏసీబీ ఉచ్చు

**డ్రైవర్ ఖాతా నుంచి కుమార్తెకు రూ.24.80 లక్షలు!**

**ఫిర్యాదు నేపథ్యంలో 8 ప్రాంతాల్లో సోదాలు..రూ.3.06 కోట్ల ఆస్తులను గుర్తించాం : ఏసీబీ**

**ఇటీవల ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న మైనింగ్ ఏడీ బొజ్జ జయరాజ్**

**బోడుప్పల్/భూపాలపల్లిఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
ఆయన ప్రభుత్వ శాఖలో కీలక అధికారి. ఇటీవల ఉత్తమ అధికారిగా పురస్కారం కూడా అందుకున్నారు. కానీ కొద్ది రోజులకే ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఆయనపై ఏసీబీ కేసు నమోదైంది. గురువారం రాష్ట్రంలోని ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.3.06 కోట్ల ఆస్తులు వెలుగుచూశాయి. డ్రైవర్ ఖాతా నుంచి ఆయన కుమార్తె ఖాతాకు రూ.24.80 లక్షలు బదిలీ అయినట్టు గుర్తించడం ఈ కేసులో కీలక మలుపు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైన్స్ అండ్ జియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి

మిగతా 2లో.



# యశోదాలో గవర్నర్‌కు సిఎం పరామర్శ

**హైదరాబాద్,ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.



# దూసుకొచ్చిన మృత్యువు

**పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు**

**ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు**

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు**

**తోణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు**

**పల్నాడు,ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.




మిగతా 2లో.

## ఖేలో ఇండియా

# సంవాద్

**దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం**

**క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు**



**న్యూఢిల్లీ,ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారంనిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే

మిగతా 2లో.

# మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి

**యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు**

**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**

**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**

**తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్**



**న్యూఢిల్లీ,ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు.

మిగతా 2లో.

# 300 మంది భారతీయుల గల్లంతు

**మొదటిపేజీ తరువాయి**



వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాట్మాండూకు పంపింది.

# ఖేలో ఇండియా సంవాద్

**మొదటిపేజీ తరువాయి**

సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి

**మొదటిపేజీ తరువాయి**

నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# హరీశ్ రావు అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**



కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

# నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బోర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్నపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫార్సుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటుచేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫార్సు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీనిని బట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

# దూసుకొచ్చిన మృత్యువు

**మొదటిపేజీ తరువాయి**

మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర



దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.



క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు.

# మీర్ ఆలం చెరువుకు కొత్త హంగులు

ముఖ్యమంత్రికి వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సందర్శన సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్**

మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం



ప్రత్యేక ఆట స్థలాలు, వినోదం, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారని తెలిపారు.

**ఐలాండ్లకూ కొత్త రూపు**

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్(టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులు పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.

**జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం**

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి**

మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆగస్టు 27 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తి కాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్-కమ్-పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువు పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు సరికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. సమగ్ర అభివృద్ధి పూర్తయితే హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది. కుటుంబం మొత్తం ఒకే చోట రోజంతా ప్రకృతి, వినోదం, జలక్రీడలు, విశ్రాంతిని ఆస్వాదించేలా మిర్ ఆలం చెరువును తీర్చిదిద్దనున్నారు.

# మైనింగ్ అధికారిపై ఏసీబీ ఉచ్చు

అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బొజ్జ జయరాజుపై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు ప్రారంభమయ్యాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లోని ఈస్ట్ హనుమాన్‌నగర్‌లో ఉన్న జయరాజ్ నివాసంతోపాటు భూపాలపల్లి కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయం, సూర్యాపేట, తాండూరు తదితర ప్రాంతాల్లోని బంధువులు, సహచరులకు సంబంధించిన మొత్తం ఎనిమిది ప్రదేశాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీ కార్యాలయంలో వరంగల్ ఏసీబీ కార్యాలయం నుంచి వచ్చిన సీఐ ప్రవీణ్‌కుమార్ బృందం సోదాలు నిర్వహించింది. కార్యాలయంలో రికార్డులను క్షుణంగా పరిశీలించింది. ఏసీబీ సోదాల సమయంలో ఏడీ కార్యాలయంలో లేరు. ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌లు మాత్రమే ఉండగా వారి నుంచి వివరాలు సేకరించారు. ఇసుక అక్రమ వ్యవహారంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో ఏడీ జయరాజ్ ఇండ్లల్లో, కార్యాలయంతో పాటు పలు చోట్ల సోదాలు జరిగాయి. జయరాజ్ 2024 మార్చి15లో భూపాలపల్లిలో ఏడీగా విధుల్లో చేరారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భూపాలపల్లి జిల్లాలో ఉత్తమ అధికారిగా జయరాజ్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న కొద్ది రోజులకే ఆయన నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ సోదాలు జరగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సోదాల్లో బోడుప్పల్‌లో సుమారు రూ.40 లక్షల విలువైన జీ+2 భవనం, హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో రూ.32.81 లక్షల విలువైన ఫ్లాట్‌ను అధికారులు గుర్తించారు. కీసరలోని రెండు ప్లాట్లతో కలిపి మొత్తం ఐదు ప్లాట్లు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ తెలిపింది. రూ.10.03 లక్షలతోపాటు మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71.27 లక్షల నిల్వలు బయటపడ్డాయి. పోస్టాఫీస్ పొదుపు పథకాల్లో రూ.20.86 లక్షలు, ఎల్ఐసీ, మ్యాక్స్ లైఫ్ పాలసీల్లో రూ.19.86 లక్షల పెట్టుబడులను గుర్తించారు. సుమారు రూ.37.23 లక్షల విలువైన 629 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.10.67 లక్షల విలువైన ఇంటి సామగ్రిని కూడా ఆస్తుల జాబితాలో చేర్చారు. సోదాల సందర్భంగా జయరాజ్ డ్రైవర్ సత్తునూరి యాదయ్య మొబైల్ ఫోన్, బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన ఏసీబీ అధికారులకు కీలక సమాచారం లభించినట్టు తెలిసింది. డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి జయరాజ్ కుమార్తె ఖాతాకు పలుమార్లు కలిపి రూ.24.80 లక్షలు బదిలీ అయినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఇసుక రవాణా, సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తుల నుంచి డబ్బు సేకరించి అధికారి కుమార్తె ఖాతాకు బదిలీ చేసినట్టు డ్రైవర్ విచారణలో వెల్లడించినట్టు ఏసీబీ పేర్కొంది. అయితే ఈ నగదు లావాదేవీల అసలు మూలం ఏమిటి? ఎందుకు బదిలీ చేశారు? వాటికి అక్రమ లావాదేవీలతో సంబంధం ఉందా? అనే అంశాలపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఓటరు జాబితాపై వార్డు సభ



**వర్ధన్నపేట/ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ముసాయిదా ఓటరు జాబితాపై వార్డు సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై జాబితా పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేని అర్హులు, పేర్లు లేదా వివరాల్లో తప్పులున్నవారు, మరణించిన, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల వివరాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించారు. ప్రతి ఒక్కరూ తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు జాబితాలో సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని చైర్మన్ సూచించారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ముసాయిదా ఓటరు జాబితా ప్రక్రియను 89.99 శాతం పూర్తి చేయడంలో కృషి చేసిన బీఎల్ఓలు, బీఎల్ఏలను చైర్మన్ అభినందించారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది సేవలను కొనియాడారు. మిగిలిన ప్రక్రియను కూడా సమన్వయంతో పూర్తి చేసి పారదర్శకమైన, తప్పులులేని జాబితా రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, అధికారులు, సిబ్బంది, బీఎల్ఓలు, బీఎల్ఏలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు మార్నేని రవీందర్‌రావు ఆశీస్సులు



**హన్మకొండ/ ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త):** హన్మకొండ నగరంలోని పలు వివాహ వేడుకలకు మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హంటర్ రోడ్‌లోని అలకనంద కన్వెన్షన్ హాల్‌లో అద్దంకి హైమవిజయ్‌కుమార్ దంపతుల కుమార్తె పూజ, చరణ్ వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వడ్డేపల్లిలోని పొద్దుటూరి జువెల్ గార్డెన్స్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో నార్లగిరి రాజమణిరమేష్ దంపతుల కుమారుడు వినయ్, అనూష (వర్షిణి) వివాహానికి హాజరై ఆశీస్సులు అందజేశారు. రాంపూర్‌లోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో సింగపురం సరోజనజగన్ దంపతుల కుమార్తె డాక్టర్ సింధూర, క్రాంతికిరణ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.
ఈ కార్యక్రమాల్లో ఐనవోలు గ్రామ ఉపసర్పంచ్ బరిగల భాస్కర్, సునీల్, గడ్డం రమేష్, సతీష్, రాజిరెడ్డి, మధు, ఏకాంతం గౌడ్, పొన్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మన్నపేటలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



**వర్ధన్నపేట/ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);** దమ్మన్నపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఎంపిక చేశారు. టీపీసీసీ నిర్ణయం, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్, గ్రామ సర్పంచ్ దుబ్బ అంజయ్య ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది.
గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మెరుగు రాజాలు గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్‌రెడ్డి, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతి బాణుప్రసాద్, ఉపసర్పంచ్ మెరుగు రమేశ్, మండల మహిళా అధ్యక్షురాలు మరుపట్ల అరుణ సాయికుమార్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం, బండౌతాపురం సర్పంచ్ బత్తినీ దశరథం, మండల నాయకులు దుబ్బ యాకయ్య, కర్కా నరసింహారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు లింగా రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పట్టాదారులకూ పీఎం కిసాన్ సాయం ఇవ్వాలి




**కేసముద్రం/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** 2019 తర్వాత కొత్తగా భూమి పట్టాలు పొందిన అర్హులైన రైతులందరినీ పీఎం కిసాన్ పథకంలో చేర్చాలని ఎంసీపీఐ(యు) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. ఉప్పరపల్లి గ్రామంలో గురువారం ఎంసీపీఐ(యు), ఏఐసీటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన, ధర్నాలో ఆయన మాట్లాడారు. 2019 ఫిబ్రవరి 1 వరకు నమోదైన పట్టాల ఆధారంగానే పీఎం కిసాన్ సాయం అందిస్తున్నారని తెలిపారు. ఆ తర్వాత కొత్తగా పట్టాలు పొందిన వేలాది మంది అర్హులైన రైతులకు సాయం అందకపోవడం అన్యాయమన్నారు. 2019 తర్వాత పట్టాలు పొందిన ప్రతి అర్హుడైన రైతును పథకంలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణకు చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. అర్హులైన రైతులందరికీ పీఎం కిసాన్ నిధులు అందే వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంకల మల్లేశం, కుండే మహేందర్, కంకల శ్రీనివాస్, బుర్రి ఐలయ్య, కంచ కొమురయ్య, కంకల శేఖర్, కుప్పలయ్య, రాంబాబుతో పాటు పలువురు రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# కొత్తపేట సెక్షన్‌లో మెరుగైన విద్యుత్ సరఫరాకు అధికారులు చేపట్టిన చర్యలు



**బయ్యారం/ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలంలోని కొత్తపేట సెక్షన్‌కు జూలై నెలలో రఫీఉద్దీన్ ఏఈగా బాధ్యతలు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టినప్పటి నాటి నుండి మండలంలోని విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాలను ముందుగానే గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఏఈ తెలిపారు. ఈ సందర్భంగా రఫీఉద్దీన్ మాట్లాడుతూ ముఖ్యంగా మహబూబాబాద్ నుండి బయ్యారం సబ్‌స్టేషన్‌కు వచ్చే 33/11 కేవీ గుంద్రాతిమడుగు ఫీడర్‌పై ఉన్న చెట్ల కొమ్మల వల్ల ఏర్పడే అంతరాయాలను గుర్తించి, సిబ్బంది సహకారంతో వాటిని తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా బయ్యారంలో రామాలయం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న ఓవర్‌లోడ్ సమస్యను గుర్తించి, ఆ లోడ్‌ను బొడ్రాయి సమీపంలోని డీటీఆర్ కు డైవర్ట్ చేసి లోడ్‌ను బ్యాలెన్స్ చేయడం ద్వారా ఓవర్‌లోడ్ సమస్యకు పరిష్కారం చూపమన్నారు. అలాగే కొత్తపేట సబ్‌స్టేషన్‌కు వచ్చే డోర్నకల్ 33 కేవీ లైన్‌లోని అంతరాయాలను గుర్తించి, వాటిని సరిచేయడం ద్వారా కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయాలను తగ్గించడం జరిగిందన్నారు. ఓవర్‌లోడ్‌కు గురవుతున్న డీటీఆర్ లను గుర్తించి, అవసరమైన చోట అదనపు డీటీఆర్ లను ఏర్పాటు చేయడం ద్వారా అన్ని గ్రామాలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే దిశగా చర్యలు కొనసాగిస్తున్నారు. డిఈ సూచనల మేరకు, ఏడిఈ పర్యవేక్షణలో ఇప్పటివరకు 93 లీనెడ్ పోల్స్ సరిచేయడం, 86 లూస్ లైన్ సమస్యలను పరిష్కరించడం, 166 స్పేసర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలన్ని సబ్ ఇంజనీర్ సందీప్, స్టాఫ్ సహకారంతో నిర్వహించినట్లు ఏఈ తెలిపారు. మున్ముందు కొత్తపేట సెక్షన్ పరిధిలో



ఏవైనా విద్యుత్ సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే వాటిని గుర్తించి, త్వరితగతిన పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేస్తామని ఏఈ తెలిపారు

# విద్యార్థులతో రక్షాబంధన్



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నుంచి వచ్చిన రాఖీలతో ధర్మసాగర్‌లోని ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ మాథ్యూస్ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు రక్షాబంధన్ నిర్వహించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు గాజ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు రాఖీలు కట్టారు. బీజేపీ సీనియర్ నాయకుడు నాగవెల్లి యుగేందర్, మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, ప్రధాన కార్యదర్శి బచ్చు శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణకు మాజీ ఎంపీ కవిత పరామర్శ



**కేసముద్రం/ఆగస్టు27 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, వెంకటగిరి మాజీ సర్పంచ్ మదారపు సత్యనారాయణను మాజీ ఎంపీ మాలోత్ కవిత గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో హన్మకొండలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య చికిత్సల వివరాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నవీన్‌రావు, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లిలో సంకు సుగుణమ్మ మృతి



**కేసముద్రం/ఆగస్టు27 (జర్నలిస్ట్ వార్త);** మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సంకు శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి సంకు సుగుణమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఉప్పరపల్లిలోని ఆమె నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుగుణమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాన్ కెనడి మృతి సంఘానికి తీరని లోటు



**రఘునాథపాలెం/ ఆగస్టు 27 (జర్నలిస్ వార్త):** నందిగామకు చెందిన సీనియర్ గ్రామీణ వైద్యుడు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యుడు డాక్టర్ జాన్ కెనడి గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి సంఘానికి తీరని లోటని సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు, కార్యదర్శి అనంతారపు వెంకటాచారి అన్నారు. జాన్ కెనడి సంఘానికి అందించిన సేవలను వారు గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం సంఘం నాయకులు, తోటి గ్రామీణ వైద్యులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నారపోగు సుదర్శన్, మండల అధ్యక్షుడు ఇనపనూరి వెంకటేశ్వర్లు, సుల్తాన్, లాలు, రఫీ, ప్రకాష్ తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మై భారత్ కార్యక్రమం




**నర్సంపేట/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మై భారత్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువతను ఉద్దేశించి ఖేల్ కీ బాత్, పీఎం కే సాత్ అంశంపై చేసిన ప్రసంగాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు వాటిని జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. కళాశాల మై భారత్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. సంధ్య మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం. రాంబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. సంధ్య, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

**టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్రకు బీజేపీ నేత భాస్కర్ల వీరంరాజు సంఘీభావం**




**వేంసూరు/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర వేంసూరుకు చేరుకున్న సందర్భంగా ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీరంరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్నారని అన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలకు వారధిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల కోసం ప్రశ్నించే జర్నలిస్టులే సొంత ఇళ్లు, స్థలాలు లేక ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర నిర్మాణంలో జర్నలిస్టుల పాత్రను విస్మరించలేమన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన జర్నలిస్టులను గుర్తించి ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి సమగ్ర విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వేంసూరు మండల యువమోర్చా అధ్యక్షుడు ధూపాటి వంశీతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండు ఓట్లు వద్దు.. ఒక ఓటే ముద్దు



**తల్లాడ/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు జాబితాలో అనర్హులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్ అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా గురువారం తల్లాడ మండలంలో ఆయన పర్యటించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఓటరు జాబితా సవరణపై సూచనలు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా తొలిసారి కార్యాలయానికి వచ్చిన నూతి సత్యనారాయణగౌడ్‌ను మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. అనంతరం మల్లారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి కటికి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో 3,552 మంది ఓటర్లు ఉండగా. 507 మంది కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థంగా చేపడుతున్నందుకు బూత్ లెవల్ ఏజెంట్లను అభినందించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరును ఓటరు జాబితాలో చేర్చేలా కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెండు ఓట్లు వద్దు. ఒక ఓటే ముద్దు అనే నినాదంతో పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలని కోరారు. బూత్ లెవల్ ఏజెంట్లు ధనకొండ నరసింహారావు, కటికి శ్రీరామమూర్తి, భూక్యా అంజయ్యలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కోసూరు వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ ఎం.ప్రసాద్, వెంకటరమణారెడ్డి, ఉపసర్పంచి యశోద, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

# బావిలోకి దూసుకెళ్లిన కారు.. మహిళ మృతి

## పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన.. ముగ్గురికి తీవ్ర గాయాలు







**భీమదేవరపల్లి/ఆగస్టు27 (జర్నలిస్ట్ వార్త):** వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తున్న కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం రాంనగర్ (మంగళపల్లి) శివారులో గురువారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన ఏలూరి రవీందర్‌రెడ్డి, ఏలూరి వీరారెడ్డి, ఏలూరి కిరణ్, ఏలూరి రాధా హుస్నాబాద్ మండలం పోతారం వద్ద ఓ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం కారులో తిరిగి వెళ్తుండగా రాంనగర్ (మంగళపల్లి) శివారులో కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏలూరి రాధా (61) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.



# మల్బరీ సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

## రైతులకు సీఎస్‌బీ శాస్త్రవేత్త భువన సూచన





**నల్లబెల్లి/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);** మల్బరీ సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించడంతోపాటు పట్టు పురుగుల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన కోకూన్ దిగుబడులు సాధించవచ్చని సీఎస్‌బీఆర్ఎస్ఆర్ఎస్ ములుగు శాస్త్రవేత్త భువన ఎస్. తెలిపారు. కేంద్ర పట్టు బోర్డు ఆధ్వర్యంలో, పట్టు పరిశ్రమ శాఖ సమన్వయంతో గురువారం నల్లబెల్లి మండలంలో నిర్వహించిన ఎంఆర్ఎంఏ 2.0 రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భువన మాట్లాడుతూ.. ఇతర పంటల నుంచి మల్బరీ సాగుకు మారే రైతులు ముందుగా భూమిని పట్టు సాగుకు అనుకూలంగా తయారు చేసుకోవాలని సూచించారు. నేల స్వభావాన్ని తెలుసుకుని అవసరమైన పోషకాలను అందించడంతోపాటు నేల సారాన్ని పెంచే చర్యలు చేపట్టాలని చెప్పారు. మల్బరీ తోటను ప్రారంభించే ముందు భూమి పునరుద్ధరణపై ప్రత్యేక శ్రద్ధ చూపితే మొక్కల పెరుగుదల మెరుగుపడి, నాణ్యమైన ఆకులు లభిస్తాయని వివరించారు.

పట్టు పురుగులకు నాణ్యమైన మల్బరీ ఆకులే ప్రధాన ఆహారం అని భువన పేర్కొన్నారు. తోట నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఆకుల నాణ్యత తగ్గి పట్టు పురుగుల పెరుగుదల, కోకూన్ నాణ్యతపై ప్రభావం పడుతుందని తెలిపారు. అందువల్ల రైతులు నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, తోటల పరిశుభ్రత వంటి అంశాల్లో శాస్త్రీయ పద్ధతులు పాటించాలన్నారు.

### నాన్ స్పిన్నింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

పట్టు పురుగుల పెంపకంలో నాన్ స్పిన్నింగ్ సమస్యను రైతులు నిర్లక్ష్యం చేయవద్దని భువన సూచించారు. పురుగులు పూర్తిస్థాయిలో పెరిగిన తర్వాత కూడా సరిగా గూడు కట్టకపోవడానికి వాతావరణ పరిస్థితులు, తగిన ఆహారం లేకపోవడం, నిర్వహణలో లోపాలు తదితర కారణాలు ఉండవచ్చని వివరించారు. పురుగుల పెంపక గదిలో పరిశుభ్రత, సరైన ఉష్ణోగ్రత, తేమను నియంత్రిస్తూ శాస్త్రీయ పద్ధతులు పాటించాలని సూచించారు.

పురుగుల పెంపకంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా కోకూన్ దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులకు వివరించారు. పురుగుల దశను బట్టి సరైన సమయంలో, సరిపడా మల్బరీ ఆకులను అందించాలని చెప్పారు. వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత పట్టు పరిశ్రమ అధికారులను సంప్రదించి తగిన సూచనలు తీసుకోవాలని కోరారు.

### సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం, పట్టు పరిశ్రమ శాఖ, కేంద్ర పట్టు బోర్డు ద్వారా అందుబాటులో ఉన్న వివిధ సబ్సిడీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని భువన సూచించారు. పట్టు సాగుకు సంబంధించిన పథకాలు, ఆధునిక పరికరాలు, సాంకేతిక సహకారం గురించి రైతులు అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు.

మల్బరీ సాగును కేవలం సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శాస్త్రీయంగా చేపట్టినప్పుడే పెట్టుబడికి తగిన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. నాణ్యమైన కోకూన్ ఉత్పత్తి చేస్తే మార్కెట్లో మంచి ధర పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### రైతులతో ముఖాముఖి

శిక్షణ కార్యక్రమంలో రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను శాస్త్రవేత్త భువన దృష్టికి తీసుకెళ్లారు. మల్బరీ తోటల నిర్వహణ, పట్టు పురుగుల పెంపకం, నాన్ స్పిన్నింగ్ సమస్యలు, నేల సారాన్ని పెంచే పద్ధతులు, అందుబాటులో ఉన్న సబ్సిడీలపై రైతులు అడిగిన ప్రశ్నలకు ఆమె వివరంగా సమాధానాలు ఇచ్చారు. రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను అవలంబించాలని సూచించారు.

కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకుడు తిరుపతి రెడ్డి, సెరికల్చర్ అధికారి మల్లయ్య, వ్యవసాయ అధికారి బి. రాజిత, వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ తదితరులు పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసి పట్టు పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు శాఖల సమన్వయంతో పనిచేస్తామని అధికారులు తెలిపారు.

# బయ్యారంలో సర్ ఫేజ్ 2 గ్రామసభ విజయవంతం





**బయ్యారం/ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక ఓటర్ సవరణ సర్ ఫేజ్ 2 గ్రామసభ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమక్షంలో ఓటర్ జాబితాను ప్రదర్శించి, ఓటర్ల వివరాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలను పరిశీలించడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా, డిప్యూటి తహసీల్దార్ సునీల్, పంచాయతీ సెక్రటరీ రాంబాబు, బయ్యారం మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య, మాజీ బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, తాటి జనార్ధన్, రంజిత్, వార్డు సభ్యురాలు ఎట్టి. శరీత, బిఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్కెట్ కమిటీ చైర్మన్



**కేసముద్రం/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి గ్రామం 3వ వార్డుకు చెందిన దివంగత స్వామిశోభారాణి దంపతుల కుమారుడు వినీత్ యాదవ్, మధుషల వివాహం స్థానిక హరిహర గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. వివాహ వేడుకకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన వధూవరులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ధన్నసరి మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు రావుల మురళి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంబటి మహేందర్‌రెడ్డి, ధారావత్ కిషోర్, వార్డు కౌన్సిలర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా సురేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ అయూబ్‌ఖాన్, కథే ప్రభాకర్, వేం అజిత్‌రెడ్డి, బోసాని శ్రీధర్, బండారు రమేష్, అనుమానగంటి రాజు, దోమటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బడితాండలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



**కేసముద్రం/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ 14వ వార్డు బడితాండలో కౌన్సిలర్ అరుణకుమారి దేవేందర్ ఆధ్వర్యంలో తీజ్ పండుగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించేలా మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి తీజ్ బుట్టలను నెత్తిన పెట్టుకుని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అరుణకుమారి దేవేందర్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీజ్ పండుగ గిరిజనుల ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు, యువతులు, స్థానిక గిరిజన పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కారు ఢీకొని రైతు మృతి







**గీసుకొండ/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);** వరంగల్‌నర్సంపేట ప్రధాన రహదారిపై కొమ్మాల స్టేజీదస్రు తండా మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగెం మండలం వంజరపల్లికి చెందిన గోనె సమ్మయ్య(70) వ్యవసాయ పనిముట్ల వెల్డింగ్ పనుల కోసం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కొమాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో నర్సంపేట నుంచి వరంగల్ వైపు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు సమ్మయ్య వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. కారు డ్రైవర్ వనంప్రమోద్ కుమార్ అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఢీకొన్న అనంతరం సమ్మయ్యను కారు కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో తలకు బలమైన గాయంతోపాటు ముఖం, ఛాతీ, ఎడమ తొడ, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గోనె సరోజన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వనంప్రమోద్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# ఓటరు సవరణపై గ్రామాల్లో అవగాహన



**దామరచర్ల/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);**ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ఫేజ్2 ప్రక్రియపై దామరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొర్ర నాగునాయక్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. మండలంలోని దామరచర్ల, కొండ్రపోలు, బొత్తలపాలెం, రాళ్లవాగు తండా, తిమ్మాపురం, తూర్పుతండా, బెట్టతండా, బోలిగుట్ట తండా, వాచ్య తండాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ప్రభుత్వం గుర్తించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకదాన్ని జతచేసి, వచ్చే నెలలో జరిగే గ్రామసభల హియరింగ్‌కు హాజరై అధికారులకు పత్రాలు సమర్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచులు బంటు రేణుక, లావూరి సుజాత, రవి నాయక్, లావూరి సైదానాయక్, ధీరావత్ శంకర్‌నాయక్, దానావత్ పార్వతి, లక్ష్మీనాయక్, ఇంజం నర్సిరెడ్డి, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటికి రాఖీ కట్టిన బొర్రా ఉమాదేవి



**ఖమ్మం/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మాజీ జెడ్పీటీసీ, వైరా మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా ఉమాదేవి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రక్షాబంధన్ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు.మంత్రి పొంగులేటికి రాఖీ కట్టడం ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని బొర్రా ఉమాదేవి తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో మంత్రి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.కార్యక్రమంలో మాజీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు కోసూరి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, దొడ్డ నగేష్, బొడ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పలువురు నాయకులు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐఆర్ 2026లో డ్రాఫ్ట్ ఓటరు జాబితా పరిశీలన





**భీమదేవరపల్లి/ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు భీమదేవరపల్లి తహశీల్దార్ రాజేష్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026లో భాగంగా గురువారం మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత బీఎల్ఓలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజల సమక్షంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను చదివి వినిపించారు. ఓటర్ల వివరాలను ప్రజలు పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో తప్పులు లేదా పొరపాట్లు ఉన్నట్లయితే వాటిని సరిచేసేందుకు గ్రామసభలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సవరణ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## హెల్మెట్ తప్పనిసరి..

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**కేసముద్రం/ఆగస్టు 27( జర్నలిస్ట్ వార్త);** ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, గ్రామంలోని ప్రధాన కూడళ్లు, వాడలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని భద్రతను పెంచుకోవాలని కేసముద్రం సీఐ సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో బుధవారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ కళాజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మూఢనమ్మకాలు, మహిళలపై అత్యాచారాలు, వేధింపుల నిరోధక చట్టాలు, డయల్–100 సేవల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆన్‌లైన్ గేమింగ్ ప్రమాదాలపై వివరించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్–100కు సమాచారం ఇవ్వాలని లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

**యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి:**ఉప్పరపల్లి సర్పంచ్ ఏర్పుల సునీత–కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులు, యువత కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆవుల ఐలయ్య, వార్డు సభ్యులు జెనిగల అనిల్‌కుమార్, రాజబోయిన శ్రీనివాస్, బోనగిరి జ్యోతి, కంచ రాజ్‌కుమార్, కుండే బాలకుమార్, తండా సంపత్, బండారు యాకమ్మ–గోపీనాథ్, మంద ప్రవీణ్, కారోబార్ కంచ కట్టయ్య, కానిస్టేబుళ్లు రాజేందర్, రాజు, కళాజాత బృందం ఇన్‌ఛార్జి వడ్లకొండ సతీష్, సభ్యులు మచ్చ పృథ్వీరాజ్, మంద ప్రవీణ్, పంచాయతీ సిబ్బంది విజయ్, వెంకన్న, అనిల్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఉద్యోగుల మహాగర్జన

## జోరువానలోనూ కదిలిన 5 వేల మంది.. -పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

### కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన టీజీఈజేఏసీ నేతలు



**ఖమ్మం/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఖమ్మం ఐడీఓసీ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన మహాధర్నాకు భారీ స్పందన లభించింది. ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసినా సుమారు 5 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తరలివచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా కొనసాగింది.టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన, జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు సమన్వయంతో కార్యక్రమం జరిగింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

**ఆరు డీఏలు విడుదల చేయాలి**

రెండో పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి నిర్ణీత గడువులో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని కోరారు. సుమారు రూ.10 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు.

**ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏ ఒక్క శాఖకు పరిమితం కావని, మొత్తం ఉద్యోగ వర్గానికి సంబంధించినవన్నారు. పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, ఆరోగ్య పథకం, సీపీఎస్ రద్దు తదితర అంశాలు ఉద్యోగుల కుటుంబాల ఆర్థిక భద్రతతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని.ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కోరారు.

**ఐక్యతతోనే సమస్యల పరిష్కారం**

జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘాల సమన్వయంతో మహాధర్నా విజయవంతమైందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘాల మధ్య ఐక్యత, సమన్వయం అవసరమని తెలిపారు.

**కలెక్టరేట్‌కు ర్యాలీ**

మహాధర్నా అనంతరం ఉద్యోగులు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పీఆర్సీ అమలు, ఆరు డీఏల విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఆరోగ్య పథకం అమలు, సీపీఎస్ రద్దుఓపీఎస్ పునరుద్ధరణతోపాటు ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**వైరా/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);**

వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణను ప్రణాళికాబద్ధంగా మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పురపాలక ఆర్థిక పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.మున్సిపాలిటీలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి, డంపింగ్‌యార్డు, తడిపొడి చెత్త సేకరణ, పన్నుల వసూళ్లు, ఆర్థిక సంఘం, డీఎంఎఫ్‌టీ, నియోజకవర్గ అభివృద్ధి, ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పట్టణంలో కొత్తగా చేపడుతున్న సీసీ, బీటీ రోడ్లు, వర్షపు నీటి కాలువలకు సంబంధించిన సమగ్ర నివేదికను అందించాలని ఆదేశించారు. మంజూరైన పనులను నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలన్నారు. డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.రూ.150 కోట్లతో



ప్రణాళికవైరా మున్సిపాలిటీ పరిధిలో కనీసం రూ.150 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిధులను సమర్థంగా వినియోగించి పట్టణ రూపురేఖలు మార్చాలని చెప్పారు.మున్సిపాలిటీ సొంత ఆదాయాన్ని పెంచుకునేందుకు ఇంటి పన్నులు, బకాయిలను లక్ష్యం మేరకు 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేసి ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. వాణిజ్య ఆస్తుల అద్దెలను క్రమం తప్పకుండా వసూలు చేయాలన్నారు.

రోజూ పారిశుద్ధ్య తనిఖీలుప్రతి రోజు ఉదయం వార్డు అధికారులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. రోడ్లను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంతోపాటు డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం వైరా రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలోని డంపింగ్‌యార్డు స్థలాన్ని, నిరుపయోగంగా ఉన్న మత్స్యశాఖ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కమిషనర్ రామచంద్రరావు, తహసీల్దార్ సురేష్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కడుపునొప్పి తాళలేక వృద్ధురాలు ఆత్మహత్య

**హసన్‌పర్తి/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):**

తీవ్రమైన కడుపునొప్పి తాళలేక ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంటురుపల్లి గ్రామంలో జరిగింది.పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పప్పు సరోజన (80) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 26న ఉదయం 6.30 గంటలైనా ఆమె ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో కుమారుడు పప్పు మహిపాల్‌రెడ్డి, కోడలు లలిత వెళ్లి చూశారు. సరోజన ఇంట్లో కిందపడి ఉండటాన్ని గుర్తించి నిద్రలేపి ఆరా తీశారు. కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగినట్లు ఆమె చెప్పింది.కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 8.30 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.తల్లి మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని, అనారోగ్యంతో బాధపడుతూ కడుపునొప్పి తాళలేకే ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



# సుగుణమ్మ మృతదేహానికి ఉమా మురళి నాయక్ నివాళి



**కేసముద్రం/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):**

కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సంకు వెంకటాద్రిరెడ్డి సతీమణి సంకు సుగుణమ్మ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు భూక్య ఉమా మురళి నాయక్ ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ అల్లం రమ నాగేశ్వరరావు, ధన్నసరి పీఏసీఎస్ అల్లం నాగేశ్వరరావు తదితరులు సుగుణమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారు దయాకర్, బానోత్ వెంకన్న, రావుల మురళి, అంబటి మహేందర్‌రెడ్డి, తరాల వీరేష్ యాదవ్, నూకల వెంకటేశ్వర్లు, గండి శ్రీనివాస్, తండా సంపత్, జెనిగల అనిల్‌కుమార్, బిల్లిపెల్లి సాంబయ్య, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, పలుస వెంకన్న, బోనగిరి రమేష్, కథే ప్రభాకర్, కట్ల పాపయ్య, సామల నర్సయ్య, శీలం సత్యనారాయణ, చిన్న సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు వివరాల్లో తప్పులుంటే సరిచేసుకోవాలి



**హసన్‌పర్తి/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);**ఎల్లాపూర్ గ్రామ ఓటర్ల జాబితాలో నమోదైన వివరాల్లో పొరపాట్లను సరిచేసుకునేందుకు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. ఇటీవల నిర్వహించిన ఎస్ఆర్ఐ సర్వేలో గుర్తించిన తప్పుల ఆధారంగా ఈ చర్యలు చేపట్టినట్లు గ్రామ పంచాయతీ అధికారి విష్ణుమూర్తి తెలిపారు.గ్రామంలో మొత్తం 2,002 మంది ఓటర్లు ఉన్నారు. 5వ వార్డులో 1,149 మంది ఓటర్లు ఉండగా 160 మంది వివరాల్లో, 6వ వార్డులో 853 మంది ఓటర్లు ఉండగా 140 మంది వివరాల్లో సవరణలు అవసరమని గుర్తించారు. పేరు, తండ్రి పేరు, ఇంటిపేరు, వయసు తదితర వివరాల్లో తప్పులు ఉన్నట్లు తెలిపారు.ధ్రువపత్రాలు సమర్పించాలి

ఓటర్ల జాబితాలో ఉన్న వివరాలను సరిచేసుకునేందుకు గతంలో నమోదైన పేర్లకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించాలని అధికారులు సూచించారు. నిర్ణీత ప్రక్రియలో ధ్రువపత్రాలు అందించకపోతే ఓటు తొలగింపునకు గురయ్యే అవకాశం ఉందని నోటీసుల ద్వారా తెలియజేశారు. 5వ వార్డు బీఎల్ఓ ఎర్ర శ్రీకళ, 6వ వార్డు బీఎల్ఓ ఎర్ర పూజ ఓటర్లకు నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

## బంధాలకు భరోసా ప్రేమకు ప్రతీక

# రక్షాబంధనం



**జర్నలిస్ట్ వార్త ప్రత్యేక వ్యాసం ఆగస్టు 27**

అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధనం చేతికి కట్టే రాఖీ ఒక చిన్న దారమే అయినా దాని వెనుక దాగి ఉన్న భావం మాత్రం ఎంతో గొప్పది ప్రేమ నమ్మకం బాధ్యత రక్షణ అనే నాలుగు భావాలను ఒకే దారంలో ముడివేసే పండుగ రాఖీ

భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో పండుగలకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది ప్రతి పండుగ వెనుక ఒక సామాజిక కుటుంబ ఆధ్యాత్మిక సందేశం దాగి ఉంటుంది అలాంటి పండుగల్లో రక్షాబంధనం ఒకటి అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ ప్రతి ఏడాది జరుపుకునే ఈ పండుగ కుటుంబ బంధాలకు మరింత విలువను చేకూరుస్తుంది సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి అతని ఆయురారోగ్యాలను కోరుకుంటుంది సోదరుడు ఆమెకు అండగా ఉంటానని కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని భరోసా ఇస్తాడు

### దారం వెనుక ఎంతో భావం

చేతికి కట్టే రాఖీని సాధారణంగా చూస్తే అది ఒక రంగురంగుల దారం మాత్రమే కానీ ఆ దారం వెనుక ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంటుంది చిన్ననాటి జ్ఞాపకాలు ఉంటాయి కలిసి ఆడుకున్న రోజులు చిన్న చిన్న గొడవలు ఒకరిపై ఒకరు చేసిన ఫిర్యాదులు తల్లిదండ్రుల వద్ద కలిసి గడిపిన క్షణాలు ఇలా ఎన్నో మధుర జ్ఞాపకాలకు రాఖీ గుర్తుగా నిలుస్తుంది

కాలం గడిచేకొద్దీ ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాల్లో బిజీ అవుతున్నారు చదువులు ఉద్యోగాలు వ్యాపారాలు వివాహాలు కుటుంబ బాధ్యతలతో అన్నాచెల్లెళ్లు దూరమవుతున్నారు కొందరు దేశాలు దాటి వెళ్లిపోతున్నారు ప్రతిరోజూ కలుసుకునే అవకాశం లేకపోయినా రాఖీ పండుగ సందర్భంగా మాత్రం ఒకరినొకరు గుర్తుచేసుకుంటారు దూరంగా ఉన్న సోదరుడికి సోదరి రాఖీ పంపడం సోదరుడు దానిని ప్రేమగా స్వీకరించడం బంధం ఎంత దూరంలో ఉన్నా హృదయాలకు దూరం లేదని చాటుతుంది

### రక్షణ అంటే కాపాడటమే కాదు

రక్షాబంధనం అనే పేరు వినగానే రక్షణ అనే భావన గుర్తుకొస్తుంది అయితే నేటి కాలంలో రక్షణకు విస్తృతమైన అర్థం ఇవ్వాల్సిన అవసరం ఉంది సోదరుడు తన సోదరిని కష్టాల నుంచి కాపాడటం మాత్రమే రక్షణ కాదు ఆమెకు మంచి విద్య అందేలా ప్రోత్సహించడం తన కాళ్లపై తాను నిలబడేందుకు సహకరించడం ఆమె అభిప్రాయాలను గౌరవించడం జీవితంలో తీసుకునే నిర్ణయాలకు అండగా నిలవడం కూడా రక్షణలో భాగమే మహిళల పట్ల గౌరవం పెరగాలి వారి భద్రత కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి సోదరుడు తన సోదరికి రాఖీ కట్టించుకున్న రోజే కాకుండా జీవితాంతం ఆమె గౌరవం భద్రత సంతోషం కోసం అండగా నిలిస్తేనే రక్షాబంధనం స్ఫూర్తి సార్థకమవుతుంది

### ఉమ్మడి కుటుంబాలకు దూరం

ఒకప్పుడు పెద్ద కుటుంబాల్లో అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళు అందరూ కలిసి పెరిగేవారు పండుగలు అంటే ఇంటి నిండా సందడి కనిపించేది ఒకే ఇంట్లో అనేక కుటుంబ సభ్యులు కలిసి భోజనం చేయడం పండుగలను ఆనందంగా జరుపుకోవడం సాధారణంగా ఉండేది కానీ నేటి పరిస్థితులు మారాయి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గిపోతోంది చిన్న కుటుంబాల సంఖ్య పెరుగుతోంది

ఉద్యోగాలు ఉపాధి కోసం యువత పట్టణాలకు నగరాలకు వెళ్తున్నారు ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు ఈ నేపథ్యంలో రాఖీ పండుగ బంధాలను మరోసారి దగ్గర చేసే సందర్భంగా మారింది ఎంత దూరంలో ఉన్నా సోదరసోదరీమణులు ఒకరినొకరు పలకరించుకోవడం వీలైతే కలుసుకోవడం ద్వారా కుటుంబ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు

### ఆస్తుల కంటే ఆప్యాయత ముఖ్యం

కుటుంబాల్లో ఆస్తులు ఆర్థిక విషయాల కారణంగా బంధాలు దెబ్బతింటున్న సందర్భాలు కనిపిస్తున్నాయి చిన్నచిన్న మనస్పర్థలు పెద్ద గొడవలకు దారితీస్తున్నాయి అన్నాచెల్లెళ్ల మధ్య కూడా విభేదాలు ఏర్పడుతున్నాయి ఇలాంటి పరిస్థితుల్లో రాఖీ పండుగ మనకు ఒక విషయాన్ని గుర్తుచేస్తుంది ఆస్తులు డబ్బు అంతస్తులు శాశ్వతం కావు కానీ బాల్యం నుంచి మనతో నడిచిన బంధం ఎంతో విలువైనది

కష్టకాలంలో అండగా నిలిచే వ్యక్తి కన్నీరు వచ్చినప్పుడు ఓదార్చే మనిషి మన విజయాన్ని మనకంటే ఎక్కువగా ఆనందించే బంధువు జీవితంలో గొప్ప సంపద అలాంటి బంధాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

### పండుగ పేరుతో ఆర్భాటం వద్దు

రాఖీ పండుగ సందర్భంగా ఖరీదైన బహుమతులు ఇచ్చుకోవడం ఆర్భాటంగా వేడుకలు జరుపుకోవడం కంటే బంధంలోని ఆప్యాయతకు ప్రాధాన్యం ఇవ్వాలి సోదరి ప్రేమగా కట్టిన రాఖీ విలువను బహుమతి ధరతో కొలవకూడదు సోదరుడు ఇచ్చే భరోసా సోదరి చూపించే ప్రేమే అసలైన బహుమతి

అదే సమయంలో పర్యావరణ పరిరక్షణను కూడా దృష్టిలో పెట్టుకోవాలి సహజ పదార్థాలతో తయారు చేసిన రాఖీలను ఉపయోగించడం ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం ద్వారా పండుగను బాధ్యతాయుతంగా జరుపుకోవచ్చు

### బంధాలు మాటల్లో కాదు చేతల్లో కనిపించాలి

రాఖీ పండుగ రోజున ఎప్పటికీ నీకు అండగా ఉంటాను అని చెప్పడం సులభమే కానీ ఆ మాటను జీవితంలో నిలబెట్టడం అసలైన పరీక్ష సోదరి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం సోదరుడికి ఇబ్బంది వచ్చినప్పుడు సోదరి తోడుగా ఉండటం ఒకరి విజయాన్ని మరొకరు ప్రోత్సహించడం కష్టాలను పంచుకోవడం ఇవే నిజమైన రక్షాబంధనం

బంధం అంటే కేవలం రక్తసంబంధం కాదు ఒకరినొకరు అర్థం చేసుకోవడం గౌరవించడం అవసరమైనప్పుడు తోడుగా నిలవడం అందుకే రాఖీ పండుగ కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఒక మంచి సందేశాన్ని అందిస్తుంది

### ప్రతి మహిళ గౌరవం సమాజ బాధ్యత

రాఖీ పండుగను కేవలం అన్నాచెల్లెళ్ల పండుగగా పరిమితం చేయకుండా మహిళల గౌరవం భద్రతకు సంబంధించిన సామాజిక సందేశంగా కూడా చూడాలి ఇంట్లో సోదరిని గౌరవించే వ్యక్తి సమాజంలో ప్రతి మహిళను గౌరవించాలి మహిళలపై వివక్ష వేధింపులు హింసకు తావులేని సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలినా సోదరి సురక్షితంగా ఉండాలి అనే ఆలోచన ప్రతి ఆడబిడ్డ సురక్షితంగా ఉండాలి అనే స్థాయికి ఎదగాలి అప్పుడే రక్షాబంధనం అసలు ఉద్దేశం నెరవేరుతుంది

### బాల్య జ్ఞాపకాలకు పండుగ

రాఖీ పండుగ వచ్చినప్పుడు చాలామందికి చిన్ననాటి రోజులు గుర్తుకొస్తాయి రాఖీ కట్టించుకునేందుకు సోదరుడు కొత్త బట్టలు వేసుకోవడం సోదరి ఎంతో ఆసక్తిగా రాఖీ ఎంచుకోవడం తల్లిదండ్రులు ఆశీర్వదించడం స్వీట్లు పంచుకోవడం ఇవన్నీ కుటుంబంలో ఆనందాన్ని నింపే జ్ఞాపకాలు

పెద్దయ్యాక జీవితంలో ఎన్నో బాధ్యతలు వచ్చినా చిన్ననాటి ఆ మధుర జ్ఞాపకాలు మాత్రం మనసులో చిరస్థాయిగా నిలిచిపోతాయి అందుకే రాఖీ పండుగ ఒక జ్ఞాపకాల పండుగ కూడా

### నేటి తరానికి చెప్పాల్సిన సందేశం

సాంకేతికత పెరిగిన కొద్దీ మనుషుల మధ్య దూరం తగ్గుతుందని అనుకున్నాం కానీ కొన్ని సందర్భాల్లో మనసుల మధ్య దూరం పెరుగుతోంది మొబైల్ ఫోన్లలో గంటల తరబడి మాట్లాడుతున్నా పక్కనే ఉన్న మనిషితో మాట్లాడేందుకు సమయం లేకుండా పోతోంది ఇలాంటి పరిస్థితుల్లో రాఖీ పండుగ కుటుంబ బంధాల విలువను మరోసారి గుర్తు చేస్తుంది

పిల్లలకు రాఖీ కట్టే సంప్రదాయం మాత్రమే కాకుండా దాని వెనుక ఉన్న ప్రేమ బాధ్యత గౌరవం సహకారం వంటి విలువలను కూడా వివరించాలి బంధాలను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో వారికి తెలియజేయాలి

### రాఖీ దారం తెగినా బంధం తెగకూడదు

రాఖీ కొంతకాలం తర్వాత చేతి నుంచి ఊడిపోతుంది కానీ ఆ రాఖీ కట్టినప్పుడు పంచుకున్న ప్రేమ నమ్మకం బాధ్యత మాత్రం జీవితాంతం కొనసాగాలి అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నచిన్న మనస్పర్థలు వచ్చినా వాటిని పక్కన పెట్టి ఒకరినొకరు అర్థం చేసుకోవాలి బంధాలను నిలబెట్టేది డబ్బు కాదు మనసు

రక్షాబంధనం మనకు చెప్పే అసలైన సందేశం ఇదే కుటుంబంలో ప్రేమ ఉండాలి బంధాల్లో నమ్మకం ఉండాలి కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవాలి

### మహిళల పట్ల గౌరవం పెరగాలి

చేతికి కట్టే రాఖీ చిన్నదైనా అది గుర్తుచేసే బంధం మాత్రం ఎంతో పెద్దది సోదరి కట్టే రాఖీలో ప్రేమ ఉంది సోదరుడు ఇచ్చే మాటలో భరోసా ఉంది ఆ బంధాన్ని జీవితాంతం కాపాడుకోవడంలోనే రాఖీ పండుగ సార్థకత ఉందిరాఖీ దారం తెగిపోవచ్చు కాలంతో రంగు వెలిసిపోవచ్చు కానీ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధం మాత్రం ఎప్పటికీ చెరిగిపోకూడదు అదే రక్షాబంధనం అసలైన స్ఫూర్తి అదే ఈ పండుగ అందించే గొప్ప సందేశం

సీనియర్ జర్నలిస్ట్
కొట్టే సుధాకర్
(లెనిన్)
టి యు డబ్ల్యూ జే
( iju) జిల్లా
కార్యవర్గ సభ్యులు
9908401581



---

# ప్రజా ఉద్యమ స్ఫూర్తి పెద్ది సుదర్శన్‌రెడ్డి

**నర్సంపేట/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):**
మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజా ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచారని జనసేన నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు శివకోటి యాదవ్ అన్నారు. నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని నివాళు లర్పించారు. నర్సంపేట రాజకీయ చరిత్రలో మద్దికాయల ఓంకార్‌తో పాటు పెద్ది సుదర్శన్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతికూల పరిస్థితులతో నిరాశలో ఉన్న తనకు పెద్ది సుదర్శన్‌రెడ్డి అండగా నిలిచి ధైర్యం నింపారని గుర్తుచేశారు. నీ కష్టం వృథా కాదు నేనున్నాను అంటూ భరోసా ఇచ్చారని తెలిపారు. సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు




చెందిన వారు సైతం రాజకీయాల్లోకి వచ్చి, ఒక పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకుని సంకల్పబలంతో, పోరాట పటిమతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చని పెద్ది సుదర్శన్‌రెడ్డి నిరూపించారని పేర్కొన్నారు. యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఆయన



విశేష కృషి చేశారని కొనియాడారు. భౌతికంగా దూరమైనా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొబ్బ పృథ్వీరాజ్, ఎలబోయిన డేవిడ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వృక్షాలకు రాఖీలు కట్టి.. పర్యావరణ పరిరక్షణకు పిలుపు




**కేసముద్రం/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);** కేసముద్రం మండలం మహమూద్‌పట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని చెట్లకు రాఖీలు కట్టి వృక్షాబంధన్ నిర్వహించారు. మొక్కలు నాటి వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమ, విశ్వాసం, రక్షణకు ప్రతీక అన్నారు. ప్రాణవాయువును అందించే చెట్లను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకే వృక్షాబంధన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నేటి విద్యార్థులు భవిష్యత్తులో పర్యావరణ రక్షకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిర్ర నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్షన్ డబ్బు కాజేసిన హెల్పర్ అరెస్ట్

### రూ.20 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం

**గీసుగొండ/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):**
డీసీఎం వాహనంలో ఉంచిన కలెక్షన్ నగదును చోరీ చేసి పరారైన హెల్పర్‌ను గీసుగొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.20 వేల నగదు, శామ్‌సంగ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గీసుగొండ సీఐ డి.విశ్వేశ్వర్ గురువారం వివరాలు వెల్లడించారు. సీఐ వివరాల ప్రకారం వరంగల్ కొత్తవాడకు చెందిన యాద గణేష్(25) బెల్ బ్రాండ్ కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గొర్రెకుంటకు చెందిన తాంటికంటి




భాస్కర్(35) అదే కంపెనీలో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 21న డ్రైవర్ కుళ్ల సునీల్, హెల్పర్ గణేష్‌తో కలిసి డీసీఎం వాహనంలో స్వీట్లు, బేకరీ ఉత్పత్తుల విక్రయాల కోసం విజయవాడ, మచిలీపట్నం వెళ్లారు. విక్రయాలు పూర్తిచేసుకుని కలెక్షన్ నగదుతో తిరిగి వస్తుండగా ఈ నెల 23న సాయంత్రం జాన్‌పాక్ వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో డీజిల్ పోయించేందుకు ఆగారు. భాస్కర్ నగదు ఉన్న బ్యాగ్‌కు తాళం వేసి సీటు వెనుక ఉంచి బిల్లు తీసుకునేందుకు కిందకు దిగారు. ఆ సమయంలో గణేష్ క్యాబిన్‌లోనే ఉన్నాడు. బిల్లు తీసుకుని తిరిగి వచ్చే సరికి గణేష్ కనిపించలేదు. నగదు బ్యాగ్‌ను పరిశీలించగా కిందివైపు కోసి ఉండటాన్ని గుర్తించారు. అందులోని రూ.1.50 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు గణేష్‌ను గుర్తించి అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.20 వేల నగదు, శామ్‌సంగ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి గతంలోనూ ఓ దొంగతనం కేసులో ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

## టీసీసీ జిల్లా మీడియా అధ్యక్షుడికి సన్మానం



**తల్లాడ/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) ఖమ్మం జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన నారపోగు ప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్ గురువారం సన్మానించారు. తల్లాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రసాద్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ జిల్లా మీడియా అధ్యక్షుడిగా ప్రసాద్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మీడియా వారధిగా పనిచేయాలని సూచించారు. తనను సన్మానించిన నూతి సత్యనారాయణగౌడ్‌కు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు, కల్లూరు టౌన్ ఇన్‌చార్జి కోసూరు వెంకటేశ్వర్లు (కె.వి.), మాజీ జెడ్పీటీసీ ఎం. ప్రసాద్, వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, తుమ్మలపల్లి రమేష్, దాసరి శ్రీనివాసరావు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువజన అధ్యక్షుడిగా ఇమ్రాన్ అలీ






**మహబూబాబాద్/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ (టీఆర్ఎల్‌డీ) మహబూబాబాద్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా షేక్ ఇమ్రాన్ అలీ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాజ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేపట్టారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు సూడి అనిల్‌రెడ్డి చేతుల మీదుగా ఇమ్రాన్ అలీ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ అలీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాజ్‌కుమార్‌రెడ్డికి, తన పేరును ప్రతిపాదించిన సూడి అనిల్‌రెడ్డికి, రాష్ట్ర కమిటీ సభ్యుడు బుల్లెట్ వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక ప్రవీణ్, అలకుంట్ల ప్రవీణ్, సూడి హరీష్‌రెడ్డి, జగన్, సురేష్‌చారి, వంతడుపుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## తోబుట్టువుల అనుబంధానికి రాఖీ ప్రతీక

**తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి దంపతుల శుభాకాంక్షలు**



**సత్తుపల్లి/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. సోదరీమణులు తమ సోదరుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఉన్నతిని ఆకాంక్షిస్తూ రాఖీ కడతారని తెలిపారు. ఈ పవిత్రమైన బంధం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు నింపాలని, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మట్టా రాగమయి దంపతులు కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కొత్తపేట సర్పంచ్.





**బయ్యారం/ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామ కాంగ్రెస్ నాయకులు రామాచారి–రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె అనూష – రాకేష్ వివాహ వేడుకలు వేణిగళ్ళ జగ్గయ్య ప్రజా వేదికలో గురువారం ఘనంగా జరిగాయి. ఆద్యంతం వైభవంగా, సంబురంగా జరిగిన పెళ్లి వేడుకలకు కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించారు. సర్పంచ్ వెంట ఉపసర్పంచ్ రావి వీరభద్రరావు, భాస్కర్, బాలకృష్ణ, పుల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాను పరిశీలించాలి



**తల్లాడ/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** ఓటర్ల జాబితాను ప్రతి ఒక్కరూ పరిశీలించి, తప్పులు ఉంటే సరిచేయించుకోవాలని తల్లాడ గ్రామ సర్పంచ్ పి. నాగేశ్వరరావు సూచించారు. తల్లాడ గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్నా జాబితాలో పేరు లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని, ఇందుకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సహకరించాలని కోరారు. తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన ఓటర్ల జాబితాను గ్రామసభలో చదివి వినిపించారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అనర్హుల పేర్ల తొలగింపునకు ఫారం–7 ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, సీనియర్ అసిస్టెంట్ మధుకర్‌రెడ్డి, జీపీఓ విజయ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దళిత చైతన్య మహాసభను విజయవంతం చేయాలి



**వరంగల్ /ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
ఆగస్టు 30న ఐగ్రేవచారి మైదానంలో నిర్వహించనున్న దళిత చైతన్య బహిరంగ సభను విజయవంతం చేయాలని దళిత డిపార్ట్మెంట్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జన్ను గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో వారు సమావేశమై సభ ఏర్పాట్లు, ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించే అంశాలపై చర్చించారు. దళితుల హక్కులు, సామాజిక సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణపై చైతన్యం కల్పించడమే సభ లక్ష్యమని తెలిపారు. దళితులు, యువత, మహిళలు, కాంగ్రెస్ నాయకులు, ఈ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కాలి



**హసన్‌పర్తి/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా ముసాయిదా ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ కోరారు. డూప్లికేట్, మరణించిన వ్యక్తుల పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించి తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. హసన్‌పర్తిలోని విజయగార్డెన్‌లో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ముసాయిదా ఓటరు జాబితా ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలతో కలిసి కిరణ్‌కుమార్ పరిశీలించారు. జాబితాలో చేర్పులు, మార్పులు, అభ్యంతరాలపై స్థానికులతో చర్చించారు. కొత్త ఓటర్ల నమోదుతోపాటు ముసాయిదా జాబితాలోని అంశాలపై అధికారుల సమక్షంలో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాలో అర్హులైన ఏ ఒక్కరి పేరు గల్లంతు కాకుండా చూడాలని కోరారు. అదే సమయంలో డూప్లికేట్, మరణించిన వారి పేర్లను గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఎమ్మార్వో, అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజుకు రాఖీలు కట్టిన చిన్నారులు



**హసన్‌పర్తి/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల మధ్య ఆప్యాయతానురాగాలకు ప్రతీకగా నిలిచే మధురమైన పండుగ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాజీపేట వండర్ ప్లే స్కూల్‌కు చెందిన చిన్నారులు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులకు స్వీట్లు తినిపించి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించారు. రక్షాబంధన్ పండుగ ప్రతి కుటుంబంలో సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలను మరింత పెంపొందించాలని, అందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వినీల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ బుకింగ్ వివరాలు నమోదు చేసుకోవాలి



**భీమదేవరపల్లి/ఆగస్టు27 (జర్నలిస్ట్ వార్త):** వానాకాలం సాగు వివరాలను నమోదు చేసేందుకు మండలంలో డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతోందని మండల వ్యవసాయ అధికారి పద్మ తెలిపారు. ఇందులో భాగంగా వాలంటీర్లు ప్రతి పంట పొలం వద్దకు వెళ్లి సర్వే నంబర్ వారీగా పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు పేరు, పంట రకం, విత్తన రకం, సాగు విస్తీర్ణం తదితర వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్లు తమ పొలాల వద్దకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి పంట వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో నమోదైన వివరాల ఆధారంగానే సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు. పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోని రైతులకు పంట విక్రయ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు వాలంటీర్లు వచ్చినప్పుడు తమ పంట వివరాలను పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మ కోరారు.

# నకిలీ వైద్యులపై కఠిన నిఘా..

## హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

**హైదరాబాద్ ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు.
కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల



ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.
ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు.
తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద 'సెకండ్ ఒపీనియన్' తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే 'డయల్ 112' కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ఓటర్ల జాబితా సవరణ: ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

**హైదరాబాద్ ఆగస్టు 27(జర్నలిస్ట్ వార్త);**
తప్పుడు సమాచారమిస్తే జైలు శిక్ష తప్పదని స్పష్టం తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ




సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

## బయ్యారం మండల ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు.

### -గుంజ వీరస్వామి.



**బయ్యారం/ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల ప్రజలకు జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ ఆడబిడ్డలకు ఆర్థిక సాధికారత కల్పించడమే అసలైన రక్షా బంధన్ అని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ కేవలం రక్త సంబంధానికి మాత్రమే పరిమితం కాదని, ఆత్మీయ అనుబంధం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.